క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే మేకపాటి పర్యటన

మర్రిపాడు: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం మర్రిపాడు మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 11.30 గంటలకు నందవరం గ్రామంలోని శ్రీవిశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో, మధ్యాహ్నం 3.30 గంటలకు ఏపిలగుంట గ్రామంలో విజయీభవ యాత్రలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటల నుంచి శెట్టిసముద్రం, చిలకపాడు గ్రామాల్లో విజయీభవ యాత్రలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారు.

ముగిసిన గంధ మహోత్సవం



మర్రిపాడు: మండలంలోని నందవరం గ్రామంలో హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి గంధ మహోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం గంధాన్ని ఆస్తాన ఏ షాబరసూల్ నుంచి దర్గాకు తీసుకువచ్చారు. దర్గాలో హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి సమాధిపై గలేపులు, పూలచద్దర్లు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. గంధ మహోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సయ్యద్ ఖైరుల్లాషా, సయ్యద్ సాని తురబా అలీషా, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

సంగం: స్థానిక పెన్నానది సమీపంలో వెలసిన శ్రీపాలేటి గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పన్నెండేళ్ల క్రితం పినాకిని నదీ తీరాన నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో ప్రతి ఏడాది వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం గంగమ్మతల్లికి పవిత్ర పినాకిని నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 22, 23 వార్డుల పేదల కోసం అర్బన్ హెల్త్ కేంద్రంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జ్యోతినగర్, పేరారెడ్డిపల్లి, నెల్లూరుపాళెం, బీసీకాలనీ, ఇందిరకాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

అసత్య ప్రచారం చేయడం సరికాదు

కావలి: కావలిలో ప్రజానేత వంగవీటి రంగా విగ్రహం ఏర్పాటులో భాగంగా విరాళాల సేకరణపై అసత్య ప్రచారం చేయడం సరికాదని విగ్రహ కమిటీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కావలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహ ఏర్పాటు కోసం రూ.లక్షల్లో విరాళాలు సేకరిస్తున్నారని దుష్ప్రచారం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఎవరెవరి వద్ద ఎంత మొత్తంలో విరాళాలు సేకరించారో పేర్లతో సహా వివరించారు. మొత్తంగా రూ.7.8 లక్షలు మాత్రమే విరాళాలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగా విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌పల్లి, జేఆర్‌పేట 3, 4 వార్డుల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. స్పందించిన కమిషనర్ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాగాల శ్రీహరి, కృష్ణమోహన్, కాలేషా, షేక్ సందానీ తదితరులు పాల్గొన్నారు.

సేవే పరమావధి

- ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వలంటీర్లు
- సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిన వ్యవస్థ
- ఏ అవసరం వచ్చినా వలంటీర్లు ఉన్నారన్న ధీమా



కరోనా సమయంలో పేదల ఇళ్ల వద్దకే వెళ్లి ఆహార పొట్లాలు అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

కావలి/చిత్రగుంట: గతంలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేయాలన్నా, పింఛన్ కోసం అర్జీ పెట్టుకోవాలన్నా ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి. మండల కేంద్రానికి 20, 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల నుంచి కూడా పనులు మానుకుని ప్రభుత్వ కార్యాలయాలకు రావాల్సిందే. ఇక్కడ అర్జీలు రాసే వారినో లేక దళారులనో పట్టుకుని తమ సమస్యను దరఖాస్తు రూపంలో అధికారుల ముందుకు తీసుకువెళ్లాల్సి వచ్చేది. అర్జీదారులు వచ్చిన రోజు అధికారులు రాకపోతే ఇక అంతే సంగతులు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇది పేదలకు ఆర్థికంగా భారంగా మారడంతోపాటు వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితిని మార్చేందుకు, ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి ముంగిటే అందించేందుకు సీఎం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

ఇంటి ముంగిటకే..

ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రజలకు ఇంటి వద్దనే పౌర సేవలు అందించడంతోపాటు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను కూడా అర్హులకు అందించేలా పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ఆయా కుటుంబాలకు అవసరమైన పౌరసేవలు, సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా, రాజకీయ జోక్యానికి తావులేకుండా పేదలకు అవసరమైన రేషన్‌కార్డులు, పింఛన్లు, పక్కా ఇళ్లు, నివేశన స్థలాలు, విద్యుత్ కనెక్షన్ల నుంచి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల వరకూ వలంటీర్లు ప్రతి పనిలోనూ ప్రజలకు సహకారం అందిస్తున్నారు. తద్వారా ప్రజలకు ఏ అవసరం వచ్చినా వలంటీర్ ఉన్నాడనే నమ్మకం కలిగింది. పింఛన్ల పంపిణీలోనూ వలంటీర్లు సరికొత్త చరిత్రకు నాంది పలికారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందిస్తున్నారు. ఏ కారణం చేతనైనా లబ్ధిదారులు ఇళ్ల వద్ద లేకపోయినా, వేరే ఊర్లు, పట్టణాలకు వెళ్లినా వలంటీర్లు కూడా వందల కిలోమీటర్లు ప్రయాణించి మరీ పింఛన్ అందజేస్తున్నారు. కావలి, బోగోలు మండలాల నుంచి తమ సొంత ఖర్చులతో చెన్నై తదితర చోట్ల ఆస్పత్రులకు వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు పింఛన్ నగదు అందించిన ఘనత వలంటీర్లు సొంతం చేసుకున్నారు.

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి..

కోవిడ్ విజృంభణ సమయంలోనూ వలంటీర్లు ప్రజలకు విశేష సేవలందించి ప్రత్యేక గుర్తింపును పొందారు. వైద్యులు, పోలీసులతోపాటు 'ఫ్రంట్ లైన్ వారియర్లు'గా వలంటీర్లు సేవలందించారు. కోవిడ్ బాధితులను గుర్తించడం, వారిని క్వారంటైన్ సెంటర్లు, ఆస్పత్రులకు తరలించడం, కోవిడ్ బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, మందులు అందించడం, కోవిడ్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి రోజూ బ్లీచింగ్ చల్లించడం తదితర పనుల్లో వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలు అందించారు. కోవిడ్ కట్టడిలో, వ్యాప్తిని అడ్డుకోవడంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరించారు.

పారదర్శకంగా..

కావలి నియోజకవర్గంలోని కావలి పట్టణం, రూరల్ మండలం, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో మొత్తం 1,01,488 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అన్ని మండలాల్లోని సచివాలయాల పరిధిలో ఉన్న వలంటీర్లు ఆయా ప్రాంతాల్లో ఉన్న 37,922 మంది పింఛన్ లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారు. అలాగే ప్రతి సంక్షేమ పథకం పారదర్శకంగా లబ్ధిదారుల ఇంటికి చేరేలా కృషి చేస్తున్నారు. నిస్వార్థంగా ప్రజల కోసం వలంటీర్లు అందిస్తున్న నిరుపమాన సేవలను ప్రజలు కొనియాడుతున్నారు.

కావలి నియోజకవర్గంలో సచివాలయాలు, వలంటీర్ల వివరాలు

మండలం	సచివాలయాలు	వలంటీర్లు
కావలి పట్టణం	28	485 మంది
కావలి రూరల్	16	311 మంది
అల్లూరు	13	258 మంది
బోగోలు	16	232 మంది
దగదర్తి	12	231 మంది



నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ప్రజా సేవకులు



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించడంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. కరోనా సమయంలో కూడా ప్రజలకు విశేష సేవలు అందించారు. వలంటీర్లు నిజమైన ప్రజా సేవకులు.

– చిమ్మిలి వెంకటేశ్వర్లుచౌదరి, కొత్తపల్లి గ్రామం, కావలి మండలం

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు



ప్రతి కుటుంబంతో మమేకమై వారి పరిధిలోని 50 ఇళ్లలో ఉన్న ప్రజల బాగోగులు చూస్తూ, అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు వారధిగా పనిచేస్తున్నాం. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం నెరవేరేలా నవరత్నాల పథకాలు ప్రజల ఇంటి ముంగిటకే చేరేలా పనిచేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేలా సేవలందిస్తున్నాం.

– మారుబోయిన మనోహర్, వలంటీర్, అల్లూరు

నేడు మండల సర్వసభ్య సమావేశం

మర్రిపాడు: మర్రిపాడు మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మనోహర్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని తెలిపారు.

అల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, వైద్యారోగ్య శాఖ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ మధులత

సోమశిల: అనంతసాగరం మండలంలోని మంగుపల్లి పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఆర్డీఓ కురబ మధులత పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని బీఎల్వోలు, వీఆర్వోలకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. రేవూరు శ్మశాన వాటిక సమస్యతోపాటు పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలపై స్థానికులను, సిబ్బందిని పిలిచి విచారణ జరిపారు. ఆమె వెంట డీటీ గిరీష్, ఆయా గ్రామాల వీఆర్వోలు ఉన్నారు.

దువ్వూరు కాలువ రెగ్యులేటర్ పరిశీలన



దువ్వూరు కాలువ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న తెలుగుగంగ ఎస్‌ఈ రాధాకృష్ణమూర్తి

సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో నూతనంగా నిర్మించిన దువ్వూరు కాలువ రెగ్యులేటర్‌ను తెలుగుగంగ ఎస్‌ఈ రాధాకృష్ణమూర్తి మంగళవారం పరిశీలించారు. నిర్మాణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యారేజ్‌ను సందర్శించి పెండింగ్ పనులను పరిశీలించారు. బ్యారేజ్ వద్ద పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ముందుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రధానంగా మరుగుదొడ్లు, వెలుతురు, నీటివసతి తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆయన వెంట సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.నెహ్రూబాబు, సిబ్బంది ఉన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారి హరివర్మ

ఉదయగిరి: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం మార్కెటింగ్ ఆడిట్ అధికారి సీఆర్ హరివర్మ తనిఖీలు చేశారు. కార్యాలయంలో ఇటీవల జరిగిన క్రయ విక్రయాలకు సంబంధించి నమోదైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా ఆడిట్ నిర్వహించామన్నారు. క్రయ విక్రయాల పట్ల సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యాలయానికి వచ్చే కార్యార్థులతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఆయన వెంట సబ్‌రిజిస్ట్రార్ విజయరాణి, సిబ్బంది ఉన్నారు.

ఆక్రమిత స్థలం పరిశీలన



టిడ్కో ఇళ్ల సమీపంలో ఆక్రమిత స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ ఫజులుల్లా

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని టిడ్కో భవనాల సమీపంలో రహదారి పక్కనే అర ఎకరాకుపైగా స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతుండడంతో ఆ స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మంగళవారం పరిశీలించారు. టిడ్కో భవనాల వద్ద పార్కు, ఆట స్థలం తదితర ప్రజా అవసరాల కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించారు. అయితే అందులో అర ఎకరం స్థలాన్ని కొందరు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తుండడం, కొన్ని హద్దు రాళ్లు ఏర్పాటు చేయడంపై స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన వీఆర్‌ఓ, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. ఆ స్థలం ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించి హద్దు రాళ్లను తొలగించి బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ విజయలక్ష్మి, మున్సిపల్ ఏఈ ఎ.ప్రసాద్, డీపీఓ రాము తదితరులు పాల్గొన్నారు.

చేపలతో అధిక ప్రయోజనాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్

ముత్తుకూరు : చేపలను భుజించడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ముత్తుకూరులోని మత్స్యకళాశాల ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ అధిపతి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. తాళ్లపూడిలో తలపెట్టిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేపల పెంపకం, ఆరోగ్యంపై ప్రభావం అనే అంశంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేపలు భుజించడం ద్వారా కంటి జబ్బులు నయమవుతాయన్నారు. ఆక్వాకల్చర్ విభాగం అధిపతి డాక్టర్ ఆనందప్రసాద్ మాట్లాడుతూ, చేపల పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు గడించవచ్చన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు త్రివేణి, శ్రీవిద్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడిరైతులకు అవగాహన కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న పశు సంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలపై వారిలో అవగాహన పెంచేలా పశు వైద్యులు, సహాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్వరుడు అన్నారు. కోవూరు మండలం వేగూరు, లేగుంటపాడు, ఇనమడుగు గ్రామాల్లో పశు వైద్యశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తితో పలు విషయాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న పశు సహాయకులు వారి పరిధిలో పశు విజ్ఞాన బడి, ఇతర ప్రత్యేక కార్యక్రమాలపై అవగాహన పెంచేలా చూడాలన్నారు. అదేవిధంగా వ్యాక్సినేషన్‌పై దృష్టి సారించాలన్నారు. కృత్రిమ గర్భధారణపై అపోహలు తొలగించి మేలుజాతి పశు ఉత్పత్తికి తోడ్పడేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నూతన ఎస్సైగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

సోమశిల: సోమశిల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా వి.సుబ్బారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరురూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై సోమశిల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై భోజ్యానాయక్ నెల్లూరురూరల్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సుబ్బారావు మాట్లాడుతూ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే సమాచారం అందించాలని కోరారు.

'ఆరోగ్య సురక్ష'తో మెరుగైన వైద్యం



చేజర్ల: కంటి అద్దాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు



సోమశిల: లింగంగుంటలో..



ఆత్మకూరురూరల్: వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

చేజర్ల: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని మాముడూరు సచివాలయ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. వైద్యశిబిరానికి మాముడూరు, సమీప గ్రామాల నుంచి వచ్చిన 609 మంది ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు. పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి సర్పంచ్ దాచూరు చిన్నయ్య, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, పంచాయతీ కార్యదర్శి వై.శీనయ్య, వైద్యులు మెహతాబ్, కంటి వైద్యనిపుణులు శైలజ, సలావుద్దీన్, జస్వంత్ పాల్గొన్నారు.

గండ్లవీడులో..

ఆత్మకూరురూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరాన్ని మంగళవారం ఆత్మకూరు మండలం గండ్లవీడు గ్రామంలో నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 550 మందికి వైద్యసేవలు అందించినట్లు ఎంపీడీఓ బాలాజీనాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి.అనూషకుమారి తెలిపారు. వైద్యపరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగ మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ టీజే దేవానంద్, సూపర్‌వైజర్లు ఎస్.సుగుణమ్మ, బి.శైలజ, షేక్ సైదా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

లింగంగుంటలో..

సోమశిల: అనంతసాగరం మండలం లింగంగుంట సచివాలయం పరిధిలో మంగళవారం ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీకాంత్ రెడ్డి, శ్రావణి, గ్రామ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వైద్యులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సాయిప్రసాద్

దుత్తలూరు: మండలంలో మార్చి 3న జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సాయిప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దుత్తలూరు పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులు 1,597 మంది ఉన్నారని, 20 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలియో చుక్కలు ఎలా వేయాలనే అంశంపై వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ లావణ్య, సీహెచ్‌ఓ ఓంకారయ్య, సూపర్‌వైజర్లు అరుణకుమారి, ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం



పుట్టమట్టి తీసుకురావడానికి వెళుతున్న భక్తులు

దుత్తలూరు: మండలంలోని నందిపాడు సెంటర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోతుగుంట శ్రీలక్ష్మీ వెంకటరత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 41 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం, దేవాలయాన్ని నిర్మించారు. మంగళవారం గంగానయనం, గణపతిపూజ, సప్త పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసనం, రక్షాబంధనం, మాతృక పూజ, అభిషేకం, అర్చనలు, మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టమట్టిని తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. బుధ, గురు వారాల్లో కూడా ప్రత్యేక పూజలు జరగనున్నాయి.